పంట పరిశీలించి.. నష్టాన్ని అంచనా వేసి..

రైతన్న కన్నీరు తుడవడానికి యంత్రాంగం సన్నద్ధమైంది. మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల ఏమేరకు పంట నష్టం జరిగిందీ అన్న వివరాలను నమోదు చేసేందుకు వ్యవసాయ క్షేత్రాలకు అధికారులు, సిబ్బందీ తరలివచ్చారు. నష్టం వివరాల నమోదు తోపాటు తదుపరి పంటను ఏమేరకు కాపాడుకోవచ్చో సలహాలు, సూచనలు చేస్తున్నారు.

- నష్టం వివరాల నమోదులో వ్యవసాయ సిబ్బంది
- సస్యరక్షణ చేపట్టాలంటూ రైతులకు సూచనలు
- నిల్వ నీటిని బయటకు పంపాలని సలహా



నాదెండ్లలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మురళీ ఇతర అధికారులు

నాదెండ్ల: పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని త్వరితగతిన వెళ్లబెట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ సూచించారు. మండలంలోని చిరుమామిళ్ళ, నాదెండ్ల గ్రామాల్లో మిచాంగ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలను గురువారం పరిశీలించారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, స్థానిక వ్యవసాయాధికారి హరిప్రసాద్‌తో కలిసి చిరుమామిళ్ళలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించారు. నాదెండ్లలో ముంపునకు గురైన పత్తి, శనగ, పొగాకు వరి, మిర్చి పొలాలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాథమిక అంచనాలతో పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక తెలియజేస్తామని రైతులతో చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే నష్ట పరిహారాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటూ వ్యవసాయ ఉద్యానవన శాఖ సహాయకులు అనుపమ, వేదవతి, వెంకటేష్, సుబ్బారావు ఉన్నారు.

ప్రాథమిక అంచనా...

ఈ ఏడాది సుమారు 7500 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. మిచాంగ్ కారణంగా సుమారు 1533 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. 1034 హెక్టార్లలో శనగ, 105 హెక్టార్లలో కంది, 20 హెక్టార్లలో పత్తి, 7 హెక్టార్లలో వరి, 5 హెక్టార్లలో మినుము, 60 హెక్టార్లలో పొగాకు, 2 హెక్టార్లలో అరటి, 250 హెక్టార్లలో మిరప, మరో 50 హెక్టార్లలో ఇతర పంటలు మిచాంగ్ తుఫాను కారణంగా నష్టపోయినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా త్వరగా బయటకు పంపేందుకు చేలగట్లకు ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు కొట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. గురువారం మండలంలోని పంటపొలాలను వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపలో తయారైన పచ్చి మిరప, పండు మిరపను చేను నుంచి కోసి కాయలు తడవకుండా, బూజు పట్టకుండా కాపాడుకోవాలని చెప్పారు. మిర్చి తెగులు సోకకుండా బ్లిటాక్స్ లేదా మ్యాన్‌కోజెబ్ విధానం, పొటాషియం నైట్రేట్ పిచికారీ, యూరియా లేదా పొటాష్ మొక్కల మొదట్లో ప్యాకెట్ ద్వారా అందించాలని తెలిపారు. వరి పొలంలో ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి టి శ్రీలత, ఏఈవో జీపీ శ్రీనివాసరావు, వీఏవోలు పాల్గొన్నారు.

చేలో నీళ్లు బయటకు పంపాలి

యడ్లపాడు: తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం తప్పక ఆదుకుంటుదని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు, జాలాది తదితర గ్రామాలను సందర్శించారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఆయా గ్రామాల్లో నీట మునిగిన శనగ, జ్యూట్, పొగాకు, మిరప తదితర పంటపొలాలను స్థానిక రైతులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

జిల్లా వ్యాప్తంగా జలవిలయానికి దెబ్బతిన్న పంటల వివరాలను ప్రాథమికంగా గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పక అన్నదాతలను ఆదుకునే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పొలాలు పూర్తిగా ఆరిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే తదుపరి పంటల సరళి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ, యడ్లపాడు ఏవో సీహెచ్ సరిత, వ్యవసాయ గ్రామ సహాయకులు, రైతులు ఉన్నారు.



జాలాదిలో రైతులకు సూచనలు చేస్తున్న మురళి



పిచికలపాలెంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రవీణ్



ఏనుగుపాలెంలో పడిపోయిన అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి నబీరసూల్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రొంపిచర్ల: ఇటీవల సంభవించిన తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. రైతులు సాగుచేస్తున్న కంది, మిర్చి, శనగ, మొక్కజొన్న, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే నష్టపరిహారం అందజేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసినవారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు సరికొండ శేషంరాజు, కల్లి వెంకట రెడ్డి, పి. రామారావు, ముప్పూరి మధుసూధన రావు, వడ్లమూడి శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఏనుగుపాలెం గ్రామంలో..

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో మిచాంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న అరటి పంటలను ఉద్యాన శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. సుమారు 18 ఎకరాల్లో అరటి పంట నష్టపోయినట్లుగా గుర్తించారు. అలాగే అధిక వర్షాల వల్ల మిరప పంటలో నిల్వ ఉన్న నీటిని బయటకు వెళ్లబెట్టాలని, వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మట్టిని ఉంచాలని, ఉరకెత్తిన పంటలకు ఒక లీటరు నీటికి 10 గ్రాములు యూరియా ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ఆకుమచ్చ తెగులు, ఎండుతెగులు ఆశించే అవకాశం ఉండటంతో రైతులకు యాజమాన్య పద్ధతులను ఉద్యాన శాఖ అధికారి నబీరసూల్ తెలిపారు.

శావల్యాపురం మండలంలో..

శావల్యాపురం: తుఫాన్ ప్రభావం ధాటికి మండలంలోని అన్ని గ్రామాల్లో 1673 ఎకరాలు మొక్కజొన్న, వరి, మిరప, శనగ తదితర పంటలు దెబ్బతిన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ గురువారం తెలిపారు. మండలంలోని పిచికలపాలెం గ్రామంలో తుఫాన్ ప్రభావానికి అధికంగా పంటలు దెబ్బతిన్నా వాటిని పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా నివేదికలు పంపుతామన్నారు. అయితే పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ తిరివిధి శివకుమారి రమణారావు, రైతులు
పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందిస్తాం: ఎమ్మెల్యే గోపిరెడ్డి

రొంపిచర్ల: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కొనకంచివారిపాలెం, రొంపిచర్ల, వడ్లమూడి వారిపాలెం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటపొలాలను ఆయన గురువారం పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న, శనగ, వరి తదితర పంటలను ఆయన పరిశీలించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మండలంలో 3000 హెక్టార్‌లలో వరి, కంది, మిర్చి, మొక్కజొన్న, శనగ, అరటి, తెల్లజొన్న లాంటి పైర్లను సాగు చేశారు. అయితే అధికంగా కురిసిన వర్షాలకు, గాలులకు వర్షపు నీటిలో పంట మునిగిపోయి ఉరకెత్తి తెబ్బతిన్నాయి. ఈ నెల 9వ తేదీ నుంచి పంట నష్టం అంచనాను అధికారులు టీంలుగా ఏర్పడి పంట నష్టాల నివేదికలు తయారు చేస్తారన్నారు. రెండు వందల సర్వే నెంబర్లకు ఒక టీం చొప్పున నియమించనున్నట్లు తెలిపారు. పంట నష్ట వివరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. రైతులతో పంటల గురించి ఇప్పటివరకు వారు వెచ్చించిన పెట్టుబడి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, వ్యవసాయ శాస్త్రవేత్త శివకుమారి, రమేష్, ఉద్యాన శాఖ అధికారి నవీన్, ఏఓ విజయ భాస్కర్, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, గానుగపంట ఉత్తమరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, గుండాల వెంకటేష్, పునుగోటి నాసరరావు, వెంకట్రావు, పమ్మి కోటిరెడ్డి, కల్లం శివారెడ్డి, జిడ్డు ఎర్రయ్య, మానుకొండ వాసుదేవరెడ్డి, కొణతం శ్రీను, కంచేటి రామారావు, వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రహదారులు, డ్రెయిన్లపై స్పెషల్ డ్రైవ్

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ పనులను మున్సిపల్ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్లు ఇతర అవసరమైన పనులను స్పెషల్ డ్రైవ్ ద్వారా అత్యవసర ప్రాతిపదికన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాలయ్యకాలనీ, రూత్ డైక్‌మెన్ కాలనీ, సింగునగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. గంగమ్మగుడి చెరువు నుంచి నీరు పొలాల్లోకి ప్రవహిస్తుండటంతో మోటార్లు ఏర్పాటు చేసి డ్రెయిన్‌లోకి మళ్లించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ సీహెచ్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో....

మంత్రి విడదల రజిని సహకారంతో పట్టణ పరిధిలో తుఫాను నష్టనివారణ చర్యలు విజయవంతంగా నిర్వహించినట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో తుఫాను విధులపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలలో భారీగా వర్షపు నీరు నిలిచి ప్రజా జీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా డ్రెయిన్లలో సిల్టు తీత పనులు నిర్వహించటం నీరు నిల్వ ఉండకుండా పారేందుకు ఎంతో దోహదపడిందని చెప్పారు. మంత్రి విడదల రజిని ఆదేశాలతో లోతట్టు ప్రాంతాలలో ముందు నుంచే జాగ్రత్త చర్యలు చేపట్టామని చెప్పారు. అదేవిధంగా వర్షాలకు ఇబ్బంది పడకుండా 2 వేల మందికి భోజనాలు అందించినట్లు వెల్లడించారు.




అధికారులతో కలసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న చైర్మన్ షేక్ రఫాని

పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం



నాదెండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నాదెండ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మిచాంగ్ తుఫాను ప్రభావంతో ఇళ్లలోకి నీరుచేరి పారిశుధ్యం అధ్వానంగా మారటంతో అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నాదెండ్ల పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మంగళవారం రాత్రి సుమారు 12 కుటుంబాలకు చెందిన వారిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించిన విషయం విదితమే.

డివిజనల్ కో ఆపరేటివ్ అధికారిగా నాగ శ్రీనివాస్



నరసరావుపేట: డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా యు.నాగశ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రహంతుల్లా, ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జె.పి.డి. టాండన్, కార్యదర్శి నర్సయ్య, వైస్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఏపీ గవర్నమెంట్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చినరామిరెడ్డి ఇతర ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియచేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 20 మంది బాధితులకు రూ.21.78 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేని పేదలను ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆదుకోవడం జరిగిందన్నారు. ఆరోగ్య శ్రీ అనుమతులు ఉన్న వైద్యశాలలోనే చికిత్స చేయించుకోవాలని అన్నారు. చాలా రకాల వ్యాధులను నేడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చడం జరిగిందన్నారు. అన్ని వైద్యసౌకర్యాలు, ఆయా విభాగాల్లో నిపుణులు ఉన్నటువంటి ఆసుపత్రులకు మాత్రమే ఆరోగ్య శ్రీ అనుమతులు ప్రభుత్వం కల్పించిందని ప్రజలు గమనించి చికిత్సలు పొందాలన్నారు. ఆరోగ్య శ్రీ ఉండి కూడా ఆసుపత్రి యాజమాన్యం వారు నగదును డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి

శావల్యాపురం: గ్రామపంచాయతీలకు ఆదాయం పెంపుదలపై పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో పేరుమీనా సీతా రామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 3 వేల జనాభా దాటిన పంచాయతీలకు వేల్పూరు, శావల్యాపురం, పొట్లూరు, కారుమంచి, మతుకుమల్లి తదితర పంచాయతీలకు ప్రభుత్వం క్యూర్ కోడ్ కల్గిన డిజిటల్ మిషన్లు మంజూరు చేసిందన్నారు. ఇక నుంచి ఈపంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు డిజటల్ క్యూర్ విధానంలో చేయాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీలో చేపల చెరువులకు వేలంపాట ద్వారా వచ్చే నిధులు పెండింగ్‌లో లేకుండా వసూలు చేయాలన్నారు. సాధారణ పరిపాలన విధానంలో భాగంగా సమావేశాలు నిర్వహణ పంచాయతీ నిధులు వినియోగం సాధారణ పరిపాలన విధానం తదితర వాటి గురించి విధి విధానాలను వివరించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపిఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

షాదీఖానా రీమోడలింగ్ పనుల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని షాదీఖానా రీమోడలింగ్ పనులను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి పరిశీలించారు. ఎమ్మెల్యే చొరవతో పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ షకీలా దస్తగిరి, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

స్వీయరక్షణకు మార్షల్ ఆర్ట్స్

చిలకలూరిపేటటౌన్: స్వీయరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానే ఉపయోగపడుతుందని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. న్యూషావలిన్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో జ్ఞానేశ్వరఫౌండేషన్ సహకారంతో గురువారం పట్టణంలోని రజక కమ్యూనిటీ హాలులో విజేతలకు అవార్డు ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌సైదా మాట్లాడుతూ విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌ను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. తద్వారా మానసిక, శారీరక ధృఢత్వం కలుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా షేక్ జాన్‌సైదాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుంగ్ అకాడమీ గౌరవ అధ్యక్షుడు మద్దుల వెంకటకోటయ్య, అకాడమీ మాస్టర్లు ఎస్కే దరియావలి, కురిచేటి బ్రహ్మయ్య, బత్తుల విక్రమ్, యడ్ల సురేష్, పాలపాటి నాగరాజు, కొత్రపాటి రాంబాబు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జాన్‌సైదా

ఓట్ల రాజకీయం.. హేయమైన చర్య

శావల్యాపురం: టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం గ్రామాల్లో ఓట్ల రాజకీయంతో పాటు అల్లర్లు గొడవలు సృష్టించాలని చేయటం హేయమైన చర్య అని బొందిలిపాలెం గ్రామ సర్పంచ్ చింతా విజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని బొందిలిపాలెం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దారు షేక్ జాన్‌సైదులను కలిశారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తొలిగిస్తున్నారని వస్తున్న వదంతులపై తక్షణమే అధికారులు స్పందించి ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా ఉండేలా చూడాలని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంతమైన గ్రామాల్లో కొందరు టీడీపీ నాయకులు కావాలనే ఇలాంటి అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధికోసం చేయటం దుర్మార్గమన్నారు. ఓట్లు తొలిగించే సంస్కృతి, సంప్రదాయం మాది కాదన్నారు. ఓట్లు తొలగింపులు పారదర్శకంగా జరగాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు జాన్‌సైదులు మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరి ఓట్లు ఉంటాయన్నారు. ప్రజలు అపోహలు నమ్మరాదన్నారు. ఇరు పార్టీల నాయకులు సంయమనం పాటించాలన్నారు. ఫాం-7 నకిలీ దరఖాస్తులు చేసే వారికి నోటీసులు ఇవ్వటానికి రంగం సిద్ధం చేశామన్నారు. తహసీల్దారును కలిసిన వారిలో అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి ట్రస్టు చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు బోడాల వీరాంజనేయులు, అల్లూరి వెంకట్రావు, అల్లూరి వెంకయ్య, వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం

శావల్యాపురం: మండలంలోని శానంపూడి, ముండ్రువారి పాలెం గ్రామాల శివారులో పోలేరమ్మ తల్లి, రేణుకమ్మ, గంగమ్మ, పోతురాజు స్వామివారి వి గ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆగమ సిద్ధాంతి గుంటూరు శేషాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు ఉదయం 8.32 నిమి షాలకు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పాపసాని విజయలక్ష్మి, పురేటి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరివిధి రమణారావు, జవంగుల బాబు, మండల కో ఆర్డినేటరు పాపసాని సురేష్, చింతా పేరయ్య పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

క్లుప్తంగా

ట్రాఫిక్ సీఐగా శోభన్‌బాబు



నరసరావుపేట టౌన్: నరసరావుపేట ట్రాఫిక్ సీఐగా శోభన్‌బాబు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ట్రాఫిక్ సీఐగా పనిచేసిన రాంబాబు బదిలీపై పొన్నూరు వెళ్లారు. గత రెండు నెలలుగా ట్రాఫిక్ సీఐ పోస్ట్ ఖాళీగా ఉండటంతో వీఆర్‌లో ఉన్న శోభన్ బాబును నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శోభన్ బాబు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



వినుకొండ (నూజెండ్ల): సమగ్ర శిక్షణ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో పెదకంచర్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో చదివే దివ్యాంగులైన (మూగ) విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఈవో జఫ్రుల్లా పాల్గొని ఎ.మానస, ఎ. రాజ్యలక్ష్మిలకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు దరఖాస్తులు నిశితంగా పరిశీలించండి



నాదెండ్ల: ప్రతి దరఖాస్తును బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్ఈ, పీఎస్ఈ దరఖాస్తులను పరిశీలించాలన్నారు. వీటిని 9వ తేదీనాటికి పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏ ఒక్కరూ అశ్రద్ధ వహించకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామ పరిధిలోని జంగాలపల్లె రోడ్డులో ఉన్న శ్మశాన వాటిక వద్ద కోతముక్క ఆడుతున్న పేకాట స్థావరంపై నాదెండ్ల పోలీసులు దాడి చేశారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.5200లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

రొంపిచర్ల : మండలంలో మాచవరం గ్రామంలో గురువారం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు పర్యటించారు. గ్రామంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావం వలన దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నీటమునిగిన పంటలను పరిశీలించి తుఫాన్ ప్రభావం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పంటలను సాగుచేస్తున్నారన్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన వర్షము వలన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు చిట్యాల శ్రీనివాసరెడ్డి, సీపీఐ మండల నాయకులు శంకరరెడ్డి, బ్రహ్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు సర్వీసు రూల్స్, బదిలీలు, పీఎఫ్ అకౌంట్స్ త్వరగా కల్పించాలని, మున్సిపల్ పరిధిలో డీవైఈవో పోస్టులు, అర్బన్‌లో ఎంఇవో పోస్టులు కేటాయించాలన్నారు. ఏళ్లతరబడి లేని ప్రమోషన్లు, తదితర డిమాండ్లను వెంటనే కల్పించాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డి.కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.